1986 దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ.

**రామారావు ప్రొద్దుపోయి యింటికి రావడంతో తన టపా చూసుకోవడానికి వీలులేకపోయింది. తెల్లవారి లేచేసరికి కిటికీలోనుంచి పడవేసిన ఉత్తరాలమీద దృష్టి పడింది. అందులో ఆడ దస్తూరితో ఉన్న కవరు! పోస్టు ముద్ర మాత్రం లేదు.**



# కొంటె సరసం

చింపి చూశాడు. "ప్రాణప్రియా! అనేక...లు" అని ఉన్నది.

"ఇవి నమస్కారములా? ముద్దులా?" అనే సందేహం కలిగింది. "ప్రాణప్రియా! అని అన్నదికాబట్టి ముద్దులే!" అని తీర్మానించుకున్నాడు. తర్వాత చదవడం ప్రారంభించాడు.

"నేనెవరో మీ స్మృతిపథంలో లేకపోవచ్చు, మీరు మాత్రం నా హృదయపీఠిమీద స్థానమేర్పరచుకున్నారు. మీరు 'డ్రెస్' చేసుకుని కాలేజీకి వెడుతూఉంటే, నా కళ్లన్నీ మీమీదే ఉంటాయి. ఆ అందాన్ని త్రాగివేయాలని పిస్తుంది.

నేనంటూ ఒక దానిని ఉన్నానని మీకు తెలియదు. పరిచయం చేసుకుందామంటే వల్లమాలిన సిగ్గు! మీ అంతట మీరే తెలుసుకుని ప్రేమిస్తే అయ్యే "మీ ప్రియురాలు".

రామారావుకు ముచ్చెమటలు పోసినై.

'ఎవరీ అమ్మాయి? దస్తూరీ బాగుంది. చదువున్న పిల్లే! ఈ ఉత్తరం ఇక్కడి కెల్లావచ్చింది? కిటికీలో నుంచి పడవేస్తే వచ్చింది! నేనుండే ఇంట్లో ఇంకొక వాటాలో పిల్లయినా కావాలి, లేకపోతే, ఈ వీధిలో పిల్ల అయినా అయివుండాలి! లేకపోతే నన్ను గురించి అంత పరిశీలనకు గాని, ఉత్తరం వేయడానికి వీలుకాని ఉండదు' అనుకున్నాడు.

కాలేజీ చదువుకోసం, తానూ తన తల్లీ మేడమీద గదిలో కాపురం ఉంటున్నారు. తల్లి ఊరికి వెళ్లింది. వారం రోజులదాకా రాదు.

కనుక అన్వేషణ కార్యక్రమం ఈ లోపుగా పూర్తి కావాలనుకున్నాడు. కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీ, స్నానం ముగించి, డ్రెస్ చేసుకుని కాలర్ ఎగరేస్తూ, 'నాకూ ఒక ప్రియురాలు ఉంది! అలా ఉండడం ఎంత గొప్ప అనుభూతి!' అనుకున్నాడు. హోటలు భోజనం చేశాడు.

కాని, ఆ లేఖ మాత్రమే మనస్సులో ఉంది. 'వీధిలో ఎవరున్నారబ్బా! కాలేజీలో చదివే మందకొడిగా నడిచే పిల్లలయి ఉండరు! కాస్త చురుకుపాలు ఉన్నవాళ్లు ఇద్దరు ముగ్గురు, పక్కవాటాలో అమ్మాయి, అతని స్మృతిపథంలో మెరిశారు. 'ఓ! ఆ రెండు జడల అమ్మాయి బలే చలాకీది!' అనుకున్నాడు. విసవిసా నడుస్తుంది. మగపిల్లల వంక కళ్లు విచ్చి మరీచూస్తుంది. కళ్లజోడు కూడా పెడుతుంది. 'ఆ పిల్లకాదుకదా!'

ఆ ముగ్గురూ కలిసి వెళ్లేటప్పుడు నమూనాగా అందరికీ కలిసివచ్చే మందహాసం చేశాడు. వాళ్లు దానిని గమనించి ఒకరివంక ఒకరు చూసుకొని నవ్వుకున్నారు. ఇది పనికాదనుకున్నాడు. విడి వేట ప్రారంభించాడు.

రెండు జడల అమ్మాయి విడిగా వెడుతూవుంటే నవ్వాడు, సకిలించాడు. ఆమె ఇతన్ని గమనించినట్టు కూడా లేదు. ఆడవాళ్లు కొందరల్లాగే ఉంటారనుకున్నాడు. అంత మాత్రంతో నిరాశ చెందరాదని, కాలేజీ వదలిన తర్వాత ఆమెననుసరించాడు.

"ఏమండీ!" అన్నాడు.

ఆ అమ్మాయి టపీమని ఆగిపోయింది.

"నాపేరు రామారావండి!"

"తెలుసండి!" అంది. రామారావు పొంగిపోయాడు.

"మీ యింటికెదురుగా మేడమీదనే నేనుంట! నేను రోజూ మిమ్మల్ని చూస్తూనే ఉన్నానండి!"

"అల్లాగా!" అంది తల పంకిస్తూ.

"మీ దస్తూరీ నా కొకమాటు చూపిస్తారా?" అన్నాడు. వెంటనే ఆమె తీక్షణంగా చూసింది

"దానితో మీకేమి పని వచ్చింది?"

"నాకొక లెటర్ వచ్చింది!"

"వస్తే?"

"మీ దస్తూరీతో దానిని సరి చూద్దామని!"

"వాట్ డు యు మీన్?"

రామారావు తత్తరపడ్డాడు.

"ఏమని వచ్చింది!"

"ఏదో వచ్చింది!" అని నీళ్లు నములుతున్నాడు.

"ఏమిటీ? నాదస్తూరీతో నీకు లెటర్ వచ్చిందా?" అని నిల తొక్కుకుని అడిగింది.

"అల్లా అనలేదు. నాకు వచ్చిన లెటర్ దస్తూరీ మీదేమోనని బేరీజు వేసుకోవాలని అనుకున్నాను!"

"వాట్! స్పీకింగ్ రాట్! నేను మీరూముకు వస్తాను. ఆ సంగతేమిటో తేల్చేస్తాను!" అంది. ఆమె ముఖం కందగడ్డ అయింది.

రామారావు వణికిపోయాడు.

"సారీ! దయయుంచి మీరు రావద్దు! నాకు లెటరేమీ రాలేదు!"

"ఏమిటీ! లెటరురాలేదూ? లెటరు రాకుండా జోక్స్ కట్ చేస్తున్నారన్నమాట!"

"వచ్చింది! మీరు మాత్రం రావద్దు!"

"నేను రావద్దా? మేనర్ లెస్ బ్రూట్! మా ఫాదరే వస్తాడు మీ రూముకు! ఆ లెటరు సంగతేదో ఆయనే చూస్తాడు!"

రామారావు కంపించి పోయాడు.


"ప్లీజ్! ఆయన్ని పంపించకండి! మీకు దణ్ణం పెడతాను!"

"పంపించి తీరుతాను! అంతా వేషంగా ఉంది! ఆడదంటే అంత అలుసా?" అని తన రెండు జడలనూ ఎడా పెడా విసిరి తల ఊపింది.

**టాంక్ బండ్ - హుస్సేన్ సాగర్**

టాంక్‌బండ్ మీది విగ్రహాలు
గతకాలానికి చిహ్నాలైతే
వికసించాల్సిన పుష్పాలకు
చావుగీతం పాడుతూ హుస్సేన్ సాగర్ అలలు

—కోడం పవన్





ఆ ఊపు అతని ముఖం మీద కొరడాతో "ఛేళ్ ఛేళ్!" మని కొట్టినట్లుగా ఉంది.

"ద్విజటలు డేంజరస్" అనుకున్నాడు మనస్సులో.

ఇంతలో వెనుకనుండి ఆమె స్నేహితురాలు వచ్చింది. ఆమెను కలిసి, "ఏమిటి రోడ్డుమీద ఈ రభస!"

**—పైడిపాటి సుబ్బరామశాస్త్రి**

అంది.

"ఏదో ఒక పొరబాటు మాట నానోట వచ్చింది. అంతేకాని తప్పుమాట మాత్రం మాట్లాడలేదు. అయినా క్షమించమని ప్రాధేయపడుతున్నాను. మీ రయినా చెప్పండి, ప్లీజ్!" అన్నాడు దీనవదనంతో ఆ ఫ్రెండ్‌తో!

"క్షమించమని మగవాడు అంటుంటే, అంత పట్టుదల ఏమిటే? నీకేమీ వేరే పనిలేదా ఏమిటి, ఈ న్యూసెన్స్ తప్ప!" అంది ఆ స్నేహితురాలు ఆమెతో

"ముందు మూడుమాట్లు లెంపలువేసుకో!" అంది ద్విజట.

రామారావు వేసుకున్నాడు ఫెడేలున.

"నేను కనబడ్డప్పుడల్లా దణ్ణం పెట్టాలి!" అని హెచ్చరించింది.

"తప్పకుండా!" అన్నాడు రామారావు.

"ఇక పోదాం పదవే! బైప్‌వేస్టు ఇతనితో!" అని ఆ ఫ్రెండ్‌తో కలిసి చరచరా నడిచిపోయింది.

రామారావు 'బతుకు జీవుడా!' అని కాళ్ళీడ్చు కుంటూ రూముకు చేరాడు.

రెండు జడల అమ్మాయి వ్యవహారం వదలిపోయి నందుకు సంతోషించాడు.

'అసలు తన ప్రియురాలెవరు?' అని ఆలోచిస్తూ ఆ రాత్రి నిద్రపోయాడు.

* * *

తెల్లవారే సరికి కిటికీలోనుండి ఇంకొక కవరు ప్రత్యక్షమయింది. 'బహుశః అది రాత్రేపడి ఉంటుంది. పెడగా పడడంచేతా, తన మనస్సు వికలంగా ఉండడం చేతా దానిని గమనించలేదు' అని, అనుకున్నాడు.

క్రిందటిరోజు తనకు జరిగిన పరాభవం తలచుకుని అసలు దానిని చదువకుండా ఉందామనుకున్నాడు. ఎందుచేతనంటే అది వెనుకటి దస్తూరీతోనే ఉంది.

అయినా మనస్సాగలేదు.

చదివాడు.

"మీరు సమాధానం వ్రాయడానికి వీలుగా నా చిరునామా కూడా ఈయలేనంత దురదృష్టవంతురాలను. మీరు నిన్న నావంక చూశారు. చిరునవ్వు కూడా నవ్వారు.

నేను మందహాసంతోనైనా సమాధానం ఈయలేక పోయాను. ఏమిచేయను చెప్పండి! నా పక్కవాళ్ళు ఇట్టే పసికట్టవేస్తారు! అప్పుడు మనం ఎంత చులకనైపోతాం!

మీరు నన్ను అన్వేషించడంలో చిక్కునపడిపోతారని నాకు తెలుసు! నా మనస్సునంతా కళ్లలో పెట్టి మీవంక చూశాను. మీరు పోల్చుకోలేదు. నేనేమి చేయగలను?"

ఇట్లు, మీ ప్రియురాలు.

రామారావు జాబుచదివి ఆలోచనలో పడ్డాడు.

'ఆ అమ్మాయికి ఉన్నంత జాగ్రత్త మగవాళ్ళ దగ్గర ఉండదు. వెరితి పడ్డాను- అవమాన పడ్డాను!' అనుకున్నాడు.

'దస్తూరీ చూపించమని అడగడం అంత తెలివైన పనికాదు. ఏ నోటుపుస్తకమయినా చూసి యిస్తానని అడిగి వెరిఫై చేసుకోవలసిందని కూడా అనుకున్నాడు.


జాబు జవాబు కోరకపోయినా కోరుతున్నట్లుగా ఉంది. తిరిగి ఆశను రేకెత్తిస్తోంది. చిరునామా ఈయని ఈ ప్రియురాలసవ్వెరు? ఎవ్వరయినా ప్రియురాలేగా!

అసలు తననంటూ ప్రేమించే ఒక కాంత సృష్టిలో ఉన్నది. చేసుకున్న పెళ్లాం వ్రాసే ఉత్తరాలలో, ప్రియురాలి ఉత్తరాలలో ఉండే మజా ఉండదు. ఆ భాష మఱువు వేరు, ఈ భాష సొగసు వేరు!

ఈ ప్రియురాలు మనస్సునంతా కళ్లలో పెడితే తాను పోల్చుకోలేక పోయాడు. ఎంత దురదృష్టవంతుడు! ఎంత వ్యర్థుడు!' అని అనుకున్నాడు.

'అసలీ ఉత్తరాలు ఈ గదిలోకి ఎల్లా వస్తున్నాయి! మేడలో ఒక అమ్మాయి ఉంది. ఆ అమ్మాయి వ్రాసినది కాదు కదా! ఆ అమ్మాయి కాలేజీలో చదువుతోంది. కాని ముఖం ఎప్పుడూ మొట మొట లాడుతూనే ఉంటుంది. విప్పారి ఉండనే ఉండదు!

ఇంట్లోకూడా ఎప్పుడూ నవ్వినట్లు కనబడదు! బాగా ప్రేమ ఉన్నవాళ్లు అల్లాగే జాగ్రత్తగా ఉంటారేమో! ముఖం అల్లా పెడితే మాత్రం, వాళ్లకి లోపల కోరిక ఉండదా! ఉండవన డానికి వీలులేదు. వాళ్ళూ ఆడవాళ్లే కాదా!



ఆ పిల్ల వ్రాసి ఉంటుందా? ఏమో! నారీహృదయం ఎవరు గ్రహించగలరు?

పాముకాళ్లనైనా గుర్తించవచ్చును కాని ఆడదాని మనసు తెలుసుకోవడం కష్టం!

ఆ గుండెలోతులు ఒక పట్టాన అందనే అందవు!

'ఈ ఉత్తరాలు పడవేసే అవకాశం మేడమీద వాళ్లకు కాకపోతే బయటివాళ్లకుంటుందా? బడ బడా మాట్లాడే వాళ్లు ఇల్లాంటి పనులు సాధారణంగా చేయరు. ముళ్ల ముచ్చులుగా ఉండేవారే ఎంతసాహసమైనా చేయగలరు!

'కాని ఆ అమ్మాయికి తన పొడకూడా గిట్టనట్లు కన్పిస్తుందే! మేడమెట్లు ఎక్కేటప్పుడు కాని, దిగేటప్పుడుకాని నేను పూర్తిగా వెళ్లానని ధృవపరచుకున్న తర్వాత కాని అడుగువేయదే! సరే! హృదయానికి కవాటలు కళ్లు. వాటిని పరిశీలనగా చూద్దాం! అర్థమవుతుందేమో!'

## పుష్పం

నా మానస సరోవరంలో పూచిన ప్రేమ పుష్పాన్ని<br>
మువ్వ తీసుకుంటే ఆనందంతో తేలిపోయా!<br>
దాని రేఖలు త్రుంపి క్రింద పడవేస్తున్న<br>
నిన్నుచూసి<br>
దుఃఖంలో మునిగిపోయా!

**—కురుమద్దాలి పద్మావతి**

* * *

ఆరోజు రామారావు ఆ అమ్మాయి కోసం కాపు వేశాడు. తనకు మాట్లాడడం చేతకాదని క్రిందటి రోజునే రుజువయింది కనుక, నోటిని మాత్రం హద్దులో పెట్టుకోవాలనుకున్నాడు.

సరిగా ఆ అమ్మాయి కాలేజీకి బయలుదేరిన వేళకే, తానూ బయలుదేరాడు. వెనుకగా గబగబా మెట్లు దిగాడు. ఆమె ఎక్కిన సిటీబస్సే ఎక్కాడు. కాలేజీలో నుంచి వచ్చేటప్పుడు ఆమె ఎక్కిన సిటీబస్సేఎక్కాడు. ఆమె తన మనస్సును కళ్లలో పెట్టుకొని చూస్తోందా లేదో గమనిస్తూన్నాడు. ఆరోజున అల్లా చూడకపోవచ్చు ననుకొన్నాడు. తానే మందహాసాలూ, నేత్రావధానాలూ చేశాడు. ఇంటికి వచ్చేదారిలో కూడా ఆమె అడుగులలో అడుగులువేసి నడుస్తున్నాడు.

ఆ అమ్మాయి మధ్యలో ఆగిపోయింది.

అతడూ ఆగవలసి వచ్చింది.



''మిస్టర్ రామారావు!'' అన్నది ఆ అమ్మాయి హుంకరించి.

నేరంచేసిన వాడిమోస్తరుగా ముఖం పెట్టాడు.

''ఇందాకటి నుంచీ చూస్తున్నాను! అసలు పొద్దుటి నుంచీ కూడా చూస్తున్నాను. నన్నే వెంటాడుతున్నారు. ఇంటికి మీరు ముందు వెడతారా! నన్ను వెళ్లనిస్తారా? ఇల్లా వెళ్లడం మాత్రం కుదరదు'' అంది.

''మీ యిష్టం? పోనీ మీరే వెళ్లండి'' అన్నాడు బిక్కమొగం పెట్టి.

''నేనువెడితే మీరు నావెంట రాకూడదు. ఇది పబ్లిక్ బజారు అని మీరంటే అనవచ్చు! నాకు రెండు చెప్పులున్నాయి. జనంమూగుతారు. నేను చెప్పినదే నమ్ముతారు!''

''మీరు నన్ను అపార్థం చేసుకున్నారు!''

''సరిగానే అర్థం చేసుకున్నాను. మీ అమ్మగారి మంచితనంచూసి మిమ్మల్ని క్షమిస్తున్నాను'' అని టకటకా వెళ్లిపోయింది ఆ అమ్మాయి.

రామారావు ఖిన్నుడై యింటికి ఆలస్యంగా వెళ్లాడు.

* * *

మరురోజు మళ్లీ జాబు పడివుంది.

''నిన్న మీరు కన్పించనేలేదు! నా కళ్లు మీకోసం వెదకినై. ఎవరినిచూసినా మీరు కాదు. చాలా విచారించాను'' మీ, చరణదాసి- అని ఉంది ఆ జాబులో.

ఉత్తరాలు పొట్టివవుతున్నై.

మనస్సు బరువెక్కుతోంది.

ఆ వీధిలో కళాశాల విద్యార్థిని ఇక ఒక్కర్తే ఉంది. కాని ఆమె మీద తానుపరిశీలనా ప్రయోగం చేయదలచ లేదు.

ఇంత లో దాసీపిల్ల కసవు చిమ్మడానికి వచ్చింది. పేరుకు పిల్ల అయినా అది పసిపిల్ల మాత్రం ఏమీకాదు.

ఈ జాబులు కిటికీలోనుండి పడవేయడంలో దానికి ఏమయినా ప్రమేయం ఉన్నదేమోనని అనుమానం కలిగింది.

పరిశీలనగా దానివంక చూశాడు.

తనకు వచ్చిన ఆలోచనకు తనకేనవ్వువచ్చినవ్వాడు. ఆ పిల్ల రామారావు వంకకు చూసి నవ్వనే నవ్వేసింది. తిరిగి రామారావుకు నవ్వువచ్చింది- అప్రయత్నంగా.

రామారావు నవ్వునుచూసిన దాసీకి చనువువచ్చింది.

''అయ్యగారు! ఒక్క పావలా ఇప్పించండి. మీపేరు చెప్పుకు కాఫీ తాగుతాను'' అంది.

''ఇస్తాకాని, నేనొకటి అడుగుతా-చెబుతావా''? అన్నాడు.

''మీరడగాలికాని చెప్పకుండా వల్ల అవుతుందా నాకు!'' అంది ముఖవికాసంతో. దానికేదో తెలిసి వుంటుందని రామారావు నిశ్చయించుకున్నాడు.

''నిజంచెబితే-నీకు పావలా కాదు, రూపాయియిస్తా!'' అన్నాడు వెంటనే. ఆ పిల్ల ముఖం చేటంతయింది.

''అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేటండీ!'' అంది వెంటనే. దగ్గరకు వచ్చేసింది, అడగమని.

రామారావుకు వణుకుపుట్టింది.

''అయ్యగారూ! అల్లా వణికిపోతున్నారు! 'రాస్య'మా అండీ!'' అంది.

### కాగితం మీదే

ఒకసారి శ్రీశ్రీ, మరికొందరు మిత్రులు ఒక సాహితీ సభలో పాల్గొన్నారు. ఓ కొంటె కోణంగి లేచి ''శ్రీశ్రీగారూ! నంది తిమ్మన ముక్కు మీద పద్యం వ్రాసి ముక్కు తిమ్మనగా పేర్గాంచాడు కదా! అలా మీరెప్పుడైనా దేనిమీదైనా వ్రాశారా?'' అని అడిగాడు.

''బాబూ! నేను ముక్కుల మీదా, కళ్ల మీదా పద్యాలు వ్రాయను. కాయితాల మీదే వ్రాస్తాను'' అని చమత్కరించారు.

— వసంత (మహబూబాబాద్)






"అవునే!" అన్నాడు మాటపెగుల్చుకొని.

"నేనోరికీ సెప్పను. అంత రాస్యమయితే నాసెవిలో సెప్పండి" అంది. తన ఆందోళన గమనించి మనస్సులో బరువు దింపినందుకు రామారావు ఎంతో సంతోషించాడు.

"ఆ! ఏమీలేదు! ఈ వీథి చివరి డాబాలో అమ్మాయి సంగతి! అది నువ్వు పనిచేసే ఇల్లేగా!" అని అంతకంటే చెప్పలేకపోయాడు.

"ఆ అమ్మాయి మిమ్మల్ని రమ్మన్నదా-అండి?" అంది. తనకంటె రెండాకులు ఎక్కువ చదివే ఆ పిల్ల దగ్గర ఎల్లా మాట్లాడాలో తోచలేదు.

"ఆ అమ్మాయి అట్లాంటిదేనా? నీకు తెలుసా?" అనేశాడు.

"బలే సరదా ఆమె అండీ! పాపం పుణ్యం మనకు తెల్దండి! కాని ఎప్పుడూ ఏటో రాస్తా ఉంటుందండి."

"వ్రాస్తుందికదా! ఆ అమ్మాయి వ్రాత నీకు తెలుసునా?"

"నాకు అచ్చరాలు రావు కదండీ!" అంది.

"రాకపోయినా వ్రాత గుర్తు పట్టగలవా?" అన్నాడు. ఆ పిల్ల నమ్మకంగా తల ఊపింది. వెంటే రామారావు మూడు జాబులూ తీసి చూపించాడు.

"ఇల్లాగే రాస్తారండీ! ఇవి మీకు రాశారా అండీ!" అంది.

"ఇశ్శు! నెమ్మదిగా! పక్క వాటా వాళ్ళు మన మాటలు వింటారు!" అన్నాడు. మళ్ళీ ఆ అమ్మాయి బిగ్గరగా అదే ప్రశ్న అడిగింది. రామారావు వెంటనే ఆ పిల్ల నోరు మూశాడు. "నెమ్మదిగా!" అని అంటూ, "ఆ అమ్మాయి వ్రాసిందో, లేదో నువ్వు కనిపెట్టి చెప్పాలి" అన్నాడు.

"ఈ సదుగుకున్నోళ్ళు కొంపలు మునిగే పని సేసేత్తారండి! ఉత్తరాలు రాయడమేటండీ?" అంది నెమ్మదిగా.

"ఉత్తరాలు వ్రాయకపోతే, ఒకళ్ళ మనసు ఒకళ్ళు ఎల్లా గ్రహిస్తారు?" అన్నాడు.

"పనిలేనిపాట! ఉత్తరాలు రాయడం ఒక పని! అవి ఎక్కడో పడేయడం ఒక పని! మళ్ళీ ఆతలవాళ్ళు రాయడం ఇంకోపని! ఏటండీ—ఇదంతా! ఛీ!"

"మరి ఏమి చెయ్యాలంటావ్?"

"ఒకొళ్ళొంక ఒకళ్ళు సూసుకుంటే సూపుల్లో తేలిపోరా ఏటండీ! ఏం సెయ్యాలని మీరుకూడా అలా అనేస్తే మరెలాగండీ! సూపూ సూపూ కలిసిపోతే, వెంటనే సై అంటే సై అనుకుంటే, చల్ మోహనరంగా అయిపోదా అండీ! ఇంతకాలయాపన ఎందుకండీ!"

"చూపుల్లో తేలిపోతుందంటావు కదా! నా చూపులు ఎల్లా ఉంటాయి?"

"ఏటి సెప్పాలండీ! మీకు మనసెంతో సిగ్గంత! సిగ్గెంతో భయమంత! అసలు మీరు ఇట్టాంటోటికి పనికిరారండీ!"

### ఎరుపు చెలి

"శ్రీశ్రీగారూ మీరు ఆరాధనలో 'నా హృదయంలో నిదురించే చెలీ' అంటూ పాట వ్రాశారు కదా! ఇంతకూ మీ హృదయంలో నిదురించె చెలి ఎవరండి?" కొంటెగా ప్రశ్నించిందో అమ్మాయి. చెలి ఎవరో చెపితే "మీరేం విప్లవ కవయ్యా బాబూ!" అని ఎద్దేవా చెయ్యాలని ఆ అమ్మాయి ఉద్దేశం.

అది గ్రహించిన శ్రీశ్రీ "నా హృదయంలో నిదురించే చెలి విప్లవమే" అంటూ గడుసు జవాబిచ్చారు.

— వసంత (మహబూబాబాద్)

"అంతేనంటావా?"

"నేనడం ఏటండీ! మీకు తెల్దా?"

"సరే! ఈ రూపాయి తీసుకో! ఆ అమ్మాయిని గురించి నేనడిగినట్టు ఎక్కడా చెప్పకు!" అని దాని చెయ్యి పగలతీసి చేతిలో పెట్టాడు.

"మీరూపాయి మీకాడే ఉంచేసుకోండి" అని ఆపిల్ల రామారావు చెయ్యి పగలతీసి రామారావు చేతిలోనే పెట్టేసింది.

"ఎందుకు తీసుకోవు?" అని భయపడుతూ అడిగాడు.

ఆ పిల్లకు ఆ డబ్బు చాలక ఎక్కడైనా ఆ సంగతి చెప్పేస్తుందని అతని భయం!

"అయ్యగోరూ! నేను మీకేటి సాయం సేశానని తీసుకోను? జాబులు ఏరు రాసారో మీకు తెల్దాయె! నాకూ తెల్దు! నాను మీకక్కర్లేదు. మీరూపాయి నాకెందుకు?"

"మరి నువ్వెక్కడా చెప్పవుకద!"

దాసి నవ్వుతూ లేచింది.

"సెబుతాను. పదుచుపిల్ల సెవిలో రాస్యంగా మాట్లాడి, కవ్వించి, అరగంట నిలేసి, ఉసూరుమనిపించి పంపెంచేస్తే సెప్పనా?" అని ఒక నవ్వు నవ్వుతూ దూసుకుపోయింది. రామారావు విస్తుపోయాడు.

* * *

"రామారావు గారూ!" అని ఒక స్త్రీ కంఠం వినిపించింది. రామారావు వెనుతిరిగి చూశాడు. ఆగి నిల

### ఎదురు చూపు

"డాక్టరుగారూ! మా ఆవిడ అర్థరాత్రి రెండు మూడు గంటల వరకు నిద్రపోవడంలేదు. మంచి మందు వ్రాసివ్వండి" అడిగాడు మధుసూదనరావు.

"అంతవరకు ఏం చేస్తుంది?"

"నాకోసం ఎదురు చూస్తూ వుంటుందండి బాబూ!"

— కె.వి.ఎం.ఆర్ (కాకినాడ)

బడ్డాడు. ఆ అమ్మాయి దగ్గరకు వచ్చింది.

"నేను మీ సోదరిగా చెబుతున్నాను. ఈ కాలంలో చాలామంది మగవాళ్ళది ఆడ దస్తూరీయే! మీకు జాబు ఎవరయినా వ్రాసి వుంటే మిమ్మల్ని ఏడిపించడానికి మీస్నేహితులెవరో వ్రాసి ఉంటారు!" అన్నది.

ఆ అమ్మాయి ఎవరోకాదు!

ఆ రోజున రెండు జడల అమ్మాయి ఫ్రెండ్! ఆద్విజట తన వృత్తాంతం ఆమెకు చెప్పిన మీదట తన మీద జాలిచేత ఆ ఉపదేశంచేసి' ఉంటుందని రామారావు ఊహించాడు.

"థాంక్స్!" అన్నాడు. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

'ఇలా సానుభూతి చూపించే ప్రాణులు ఆడవాళ్ళలో ఉన్నారు కనుకనే, మగవాళ్ళు కొందరు బ్రతుకగలుగుతున్నారు' అనుకున్నాడు.

* * *

ఊరినుంచి రామారావు తల్లి వచ్చింది. రోజులు గడిచిపోతున్నాయి. జాబులు రావడం మానివేశాయి. ఆ మూడూ జాబులూ భద్రంగా ఒక పుస్తకంలో ఉంచి తర్వాత అతడు ఆ విషయం మరచిపోయాడు. ఆ తర్వాత మేనమామ కూతురితో అతని పెళ్ళి అయింది. ఆ పిల్ల కాపురానికి వచ్చింది. రామారావు పెళ్ళాం ఒకనాడు పుస్తకాలు సర్దుతూవుండగా, లేఖలు బయట పడినై. "ఏమిటండీ యీఉత్తరాలు?" అన్నది భర్తతో. రామారావు తెల్లబోయాడు. దాసీ కన్య వృత్తాంతం మినహాయించి, మిగిలిన కథ టూకీగా చెప్పాడు. భార్యకు నవ్వు వచ్చింది. "మన పెళ్ళికి ముందే ప్రేమ కలాపంలో పడ్డారన్నమాట!" అన్నది.

"పెళ్ళికి తర్వాతనయితే నవ్వు వూరుకుంటావా?"

"ఉత్తరాలు వస్తే మాత్రం, వాటిని చింపి అవతల పారవేసి, మీ దారిన మీరు వెళ్ళాలికాని, వీథుల్లో ఆడపిల్లల వెంట పడతారా?"

"ఏదో చిన్నతనం అయిపోయింది!"

"ఇంతకీ ఆ అమ్మాయి ఎవరో తేలలేదు కదూ?"

"తేలనే లేదు"

"తేలితే పెళ్ళి చేసుకునేవారా?"

"అల్లాగే అనుకున్నాను!" ఆమె నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు?"

"మిమ్మల్ని చూస్తే జాలి కలుగుతోంది. జాబుల మూలంగా మీరు చాలా ఇరుకులో పడ్డారు!"

"పడ్డాను మరి!"

వాస్తవానికి, రామారావు భార్యే, తన అత్తను చూడడానికి పుట్టిల్లు దగ్గరే కనుక వచ్చి, ఇంకా ఊరినుంచి రాలేదని తెలిసినప్పుడల్లా కొంటెగా ఒక జాబు పడవేసి పోయేది. సరదాగా ఆపనిచేస్తే దానికి విపరీత ఫలితం కలిగినందుకు ఆమెకు జాలికలిగింది. ఆ విషయం చెప్పాలనుకున్నా ఆచరిత్రవిన్న తర్వాత చెప్పలేకపోయింది. కాని లోపల బాధపడుతూనేవుంది. ●